సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



అన్ని వర్గాలను మోసం

రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి ఆరోపించారు. 6లో▸

జూన్ 22 నుంచి గోల్కొండ బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలు జూన్ 22 నుంచి ప్రారంభం కానున్నాయి. 22 గురువారం మొదటి, 25 ఆదివారం 2వ, 29న గురువారం 3వ బోనం ఉంది. జూలై 2న 4వ బోనం, 6న 5వ బోనం, 6వ బోనం 9న, 13న 7వ బోనం ఉంటుంది. 8వ బోనం 16న, 20న 9వ పూజ ఉంటుందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

‘పట్నం’లో భారీ వర్షం



ఇబ్రహీంపట్నం: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు 36.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

న్యూస్‌రీల్

నిషేధిత జాబితాలోంచి భూ రికార్డులను తొలగించండి



కలెక్టర్ హరీశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి

యాచారం: ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వడం లేదనే అక్కసుతో రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ భూ బాధితులు శనివారం కలెక్టర్ హరీశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి ఆధ్వర్యంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కురిమ్మిద్ద, తాడిపర్తి గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతుల పట్టా భూములు నిషేధిత జాబితాలో ఉండడంతో రైతుబంధు, బ్యాంకు రుణాలు అందడం లేదని, అత్యవసర సమయాల్లో విక్రయించుకుందామన్న అవకాశం లేకుండా పోయిందన్నారు. హైకోర్టు తమకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినా అధికారుల్లో చలనం లేదని ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుర్మిద్ద సర్పంచ్ బందె రాజశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

నల్లగొండ జిల్లా విజిలెన్స్ సీఐ గజ్జె చరమందరాజు



పోలీసు ఉద్యోగార్థులతో మాట్లాడుతున్న సీఐ గజ్జె చరమందరాజు

ఆమనగల్లు: పోలీసు ఉద్యోగార్థులు ఈ నెల 30న జరిగే మెయిన్ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో హాజరు కావాలని నల్లగొండ జిల్లా విజిలెన్స్ సీఐ గజ్జె చరమందరాజు కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయ ఆవరణలో శనివారం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్నేహహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2022 పోలీసు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఫిజికల్ టెస్టుకు శిక్షణ నిర్వహించామని, అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించామని వివరించారు. ఈ నెల 30న జరిగే మెయిన్ పరీక్షల్లో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి .. విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్నేహహస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి లింగంపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ మెట్రో నుంచి పుష్పక్ బస్సులు

మియాపూర్: మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు పుష్పక్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. శనివారం మియాపూర్ మెట్రో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ యాదగిరి, చీఫ్‌మార్కెటింగ్ అధికారి రిషి కుమార్, ఎల్అండ్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొని పుష్పక్ కేంద్రాన్ని ప్రారంభించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు 24 గంటల పాటు పుష్పక్ బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఈడీ యాదగిరి తెలిపారు. ఉదయం 6:30 నుంచి రాత్రి 10:30 వరకు 20 నిమిషాల వ్యవధిలో నడుస్తాయి. అలాగే రాత్రి 11:10 నిమిషాలకు నుంచి ఉదయం 6:10 వరకు 40 నిమిషాలకు ఒక బస్సు చొప్పున అందుబాటులో ఉంటుంది.మియాపూర్ మెట్రో స్టేషన్, జేఎన్టీయూ నుంచి విమానాశ్రయం వరకు చార్జీలు రూ. 300 ఉంటుంది. అలాగే శిల్పారామం, గచ్చిబౌలి నుంచి టిక్కెట్ రూ. 250 ఉంటుంది. గూగుల్‌పే.పేటీఎం, ఫోన్‌పే వంటి సదుపాయం కూడా ఉందని, ప్రయాణికులు నగదురహిత సేవలను కూడా వినియోగించుకోవచ్చునని ఆయన చెప్పారు.ఎయిర్‌పోర్టు ప్రయాణికులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు



డాక్టర్ ఇంజమూరి సూర్యప్రకాశ్, కామేశ్వరి దంపతులు

ఆత్మీయపు పొదరిల్లు

అక్షర జ్ఞానంతోపాటు ఆత్మీయత, అనురాగం,అనుబంధాలు పెనవేసుకున్న ‘అందరి ఇల్లు’ అది.. అక్కడ ఆపదలో వచ్చిన వారికి చికిత్స అందించి స్వాంతన చేకూర్చడంతోపాటు .. ఆకలితో వచ్చిన వారికి కులమతాలతో సంబంధం లేకుండా కడుపు నిండా భోజనం కూడా దొరుకుతుంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అక్షర జ్ఞానాన్ని పంచుతోంది. ఏ ఆదరణ లేని ఒంటరి మహిళలకు అండగా నిలుస్తోంది.



ఇదే అందరి ఇల్లు..

హుడాకాంప్లెక్స్: నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజీ వైద్య నిపుణులు డాక్టర్ కామేశ్వరి, సూర్యప్రకాష్ ఇంజమూరి దంపతులు వినూత్నంగా ఆలోచించారు. చాలా మంది వైద్యులు చికిత్సల పేరుతో తమ వద్దకు వచ్చే రోగుల జేబుల్ని గుల్ల చేస్తుంటే.. వీరు మాత్రం ఇందుకు భిన్నంగా 2005లో కొత్తపేట కేంద్రంగా 300 గజాల స్థలంలో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఓ ఇంటిని కొనుగోలు చేసి ‘మన ఇల్లు’గా మార్చేశారు. మొదట్లో ఆకలితో వచ్చిన వారికి కడుపు నిండా భోజనం సమకూర్చారు. తర్వాత నిరుద్యోగుల కోసం ఓపెన్ హౌస్ పేరుతో లైబ్రరీ ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం భవనం చుట్టూ వదిలిన ఖాళీ స్థలంలో రకరకాల మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలకు సంబంధించిన పుస్తకాలతో పాటు వివిధ పోటీ పరీక్షల కోసం ఆయా కోచింగ్ సెంటర్లు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు. ఎస్ఐ, కానిస్టేబుల్, బ్యాంకింగ్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల సన్నద్ధం కోసం మారుమూల ప్రాంతాల నుంచి నగరానికి చేరుకుంటున్న నిరుద్యోగ యువతను అక్కున చేర్చుకుంటున్నారు. అభ్యర్థులే స్వయంగా వంట చేసుకునేందుకు అవసరమైన సామగ్రినంతా సమకూర్చుతున్నారు. సేవకు మెచ్చి దాతలు కూడా వీరికి తమవంతుగా చేయూతనందిస్తున్నారు.



ఇంట్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయం

సేవే మార్గంగా..

డాక్టర్ కామేశ్వరి దంపతులు 1999లో లైఫ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గ్రూపు పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, హైదరాబాద్, సదాశివపేటలో ఆస్పత్రులు ఏర్పాటు చేశారు. 2001 నుంచి చిన్న వయసులోనే గర్భసంచి తొలగింపు చికిత్సలపై పరిశోధన ప్రారంభించి, పరిశోధన పత్రాన్ని రూపొందించారు. ఈ రిపోర్టు ఆధారంగానే సుప్రీంకోర్టు ఈ చికిత్సలపై ఆంక్షలు విధించింది. 2001లో అందరికీ ఆహారం, జ్ఞానాన్ని పంచాలనే దృక్పథంతో ఒక అరటి పండు తినండి.. మరొకటి పంచండి పేరుతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. 2005 డిసెంబర్ 1న కొత్తపేటలో ‘అందరి ఇల్లు’, 2019లో చింతల్‌లో ‘ఆనంద నిలయం’ ప్రారంభించారు. నిరాదరణకు గురైన ఒంటరి మహిళలను అక్కున చేర్చుకుని వారికి అండగా నిలుస్తున్నారు. 2020 ఆగస్టులో ‘అందరి పుస్తకం’ పేరుతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వందకు పైగా గ్రంథాలయాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు వారు సంపాదించిన ప్రతి పైసా సమాజ సేవ కోసమే ఖర్చు చేశారు.

అది ‘అందరి ఇల్లు’

- నిరుద్యోగుల కోసం గ్రంథాలయం
- సిద్ధంగా పోటీ పరీక్షల పుస్తకాలు
- ఒంటరి మహిళలకు బాసట
- అన్నార్థులకు చేయూత
- ప్రతి పైసా సమాజ సేవకే..
- ఆదర్శంగా నిలుస్తున్న వైద్య దంపతులు

సండే స్పెషల్

ఎప్పుడైనా కడుపునిండా..



ఎస్ఐ కోచింగ్ కోసం వచ్చాను. క్లాసులు ముగిసిన తర్వాత నేరుగా ఇక్కడికి చేరుకుంటాను.హాస్టల్‌కు వెళ్లి తిని రావాలంటే ప్రయాణ ఖర్చులతో పాటు సమయం కూడా వృథా అవుతుంది. వంటకు కావాల్సిన సరుకులన్నీ ఇక్కడ అందజేస్తున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళ ఇక్కడే వంట చేసుకుని తిని వెళ్తాం. ఆకలేసినప్పుడు వచ్చి కడుపునిండా తినిపోవచ్చు.

– శ్రీసాయి, అనంతపురం

సొంత ఇంట్లో ఉన్నట్లే..



ఇక్కడే బీటెక్ పూర్తి చేసి, గత ఏడాది నుంచి ఇక్కడే ఉంటూ గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నా. సొంత ఇంట్లో ఉన్నట్లే ఉంటుంది. చదువుకునేందుకు పుస్తకాలు, ఆకలిస్తే వండుకుని తినేందుకు అవసరమైన వస్తువులన్నీ ఉచితంగా సమకూర్చుతున్నారు. నాతో పాటు మరో 40 మంది వరకు ఇక్కడ చదువుకుంటున్నారు.

– దేవేందర్, నిర్మల్

సేవలోనే సంతృప్తి



షేర్ ఫుడ్, షేర్ నాలెడ్జ్, షేర్ రెస్పాన్సిబులిటీ కాన్సెప్ట్‌తో 25 ఏళ్ల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశాం. ప్రస్తుతం మాకంటూ ప్రత్యేక ఆస్తులేమీ లేవు. ఇప్పటి వరకు సంపాదించిందంతా సమాజం కోసమే వెచ్చించాం . ఆపదలో, ఆకలితో వచ్చిన వారికి సాయం చేయడంలో ఉన్న సంతృప్తి మరే దాంట్లోనూ లేదు.

– డాక్టర్ ఇంజమూరి సూర్యప్రకాష్, కామేశ్వరి దంపతులు

అనుమతులు రాక ముందే అడ్మిషన్లు



ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణకి ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు

గురునానక్ కాలేజీ నిర్వాకం

- ఐదురోజులుగా విద్యార్థుల ఆందోళన
- పట్టించుకోని యాజమాన్యం
- స్పందించని ఉన్నతవిద్యామండలి
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవితవ్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఏదైనా కాలేజీ అడ్మిషన్లు చేపట్టాలంటే.. ముందుగా సంబంధిత యూనివర్సిటీ నుంచి గుర్తింపు పొందాలి. తరగతి గదులు, ప్రయోగశాలలు, అధ్యాపకులు, ఇతర మౌలిక సదుపాయాలు తప్పనిసరి కల్పించాలి. జిల్లాలోని గురునానక్ కాలేజీ యాజమాన్యం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు చేపట్టింది. తీరా అసెంబ్లీలో ఆమోదం పొందిన ప్రైవేటు యూనివర్సిటీల బిల్లు చట్టరూపం దాల్చకపోవడం , అడ్మిషన్లు చేపట్టిన కాలేజీకి యూనివర్సిటీ నుంచి గుర్తింపు రాకపోవడంతో ఇప్పటికే రూ.లక్షలు చెల్లించి వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

రూ.లక్షల్లో వసూలు

ఎలాగైనా కాలేజీకి వర్సిటీ గుర్తింపు వస్తుందనే ధీమాతో ఇప్పటికే ఇబ్రహీంపట్నంలోని గురునానక్ కాలేజీ 2022–23 విద్యా సంవత్సరానికి నాలుగు వేలకుపైగా అడ్మిషన్లు చేపట్టింది. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3లక్షల వరకు ఫీజు వసూలు చేసింది. రెగ్యులర్ విద్యార్థులు ఇప్పటికే ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు రాసి..రెండో సెమిస్టర్‌కు సిద్ధంగా ఉన్నారు. మరో నెల రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనుండటం, ఇప్పటి వరకు కొత్త యూనివర్సిటీలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు కూడా నిర్వహించకపోవడం, విద్యార్థులు విలువైన విద్యాసంవత్సరాన్ని కోల్పోవాల్సి వస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు..

అసెంబ్లీలో పాసైన బిల్లు చట్టరూపం దాల్చక ముందే అన్ని అనుమతులు వచ్చాయని గురునానక్ కాలేజీ యాజమాన్యం నమ్మబలికింది. ఆదాయ పన్ను, ఇతర ప్రభుత్వ శాఖలకు ఏ మాత్రం చిక్కకుండా వ్యవహరించింది. తెల్లకాగితాలపై ఫీజు రిసిప్టులు జారీ చేయడంతో పాటు కనీసం కాలేజీ స్టాంప్ కూడా వేయకుండా జాగ్రత్తపడింది. విద్యా సంవత్సరం ముగుస్తుండటం, ఇప్పటి వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించకపోవడంతో అనుమానం వచ్చి విద్యార్థులు యాజమాన్యాన్ని నిలదీయగా అసలు విషయం బయటికొచ్చింది. దీంతో న్యాయం కోసం విద్యార్థులు రోడ్డెక్కారు. నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా ఇటు యాజమాన్యం నుంచి కానీ, అటు ఉన్నత విద్యామండలి నుంచి కానీ కనీస స్పందన లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యానికి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

చర్యలు తీసుకోవాలంటూ..

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు రెండు రోజుల క్రితం కలెక్టర్ హరీశ్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఆయన ఆర్డీఓ వెంకటాచారికి ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో గురునానక్ విద్యాసంస్థ యాజమాన్యం మోసం చేసిందని ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి విద్యార్థులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్‌పటేల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీగా అనుమతులు రాకున్నా అధికంగా ఫీజులు వసూలు చేశారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కార్తిక్, అశ్రిత్‌యాదవ్, పలువురు విద్యార్థులు ఉన్నారు.

నమ్మి మోసపోయాం

అన్ని అనుమతులు ఉన్నాయన్నారు. పేపర్‌లో ప్రకటన ఇచ్చారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కూడా ఇప్పిస్తామన్నారు. మేం చెల్లించిన ఫీజులకు కనీసం రిసిప్టులు కూడా ఇవ్వలేదు. ఐడీ కార్డులు ఇవ్వలేదు. ప్రాపర్ ప్రాక్టికల్స్ లేవు. జీఓ వస్తుందని చెబుతున్నా ఇప్పటికీ రాలేదు. యాజమాన్యం మాటలు నమ్మి మోసపోయాం. సెమిస్టర్ పరీక్షలు రాయించి విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలి.

– కవిత, సీఎస్‌సీ, విద్యార్థిని

కులవృత్తులకు పునరుజ్జీవం

కుమ్మర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి



కుమ్మర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో కుండలు తయారు చేస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

కందుకూరు: కులవృత్తులకు పునరుజ్జీవం పోయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సామ నరసింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గం కుమ్మర సంఘం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో కుమ్మర సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలే బీఆర్ఎస్ పార్టీ ఎజెండాగా పని చేస్తుందన్నారు. సంచార జాతుల కోసం ఎంబీసీ కార్పొరేషన్ సైతం ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కుమ్మరులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. కుల వృత్తులను కాపాడుకోవడం మన ధర్మం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ సాధ మల్లారెడ్డి, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు, రాష్ట్ర నాయకులు దయానంద్, రాజలింగం, లక్ష్మీనారాయణ, వెంకటేశం, వీరేశం, నాగేష్, శంకర్, వీరయ్య, శ్రీనివాస్, కిష్టయ్య, గోవర్ధన్, కుమార్, తుక్కుగూడ కౌన్సిలర్ సుధాకర్, సిరిగిరిపురం సర్పంచ్ సురేష్, మండల యూత్ అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తిగా ఉద్యమాలకు నాంది

- కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

షాద్‌నగర్: మేడే స్ఫూర్తిగా కార్మికులందరూ ఏకమై ఉద్యమాలకు నాంది పలకాలని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ రంగం సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను మార్పు చేసి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్మికులందరు ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోకుండా యాజమాన్యాలకు వత్తాసు పలకడం సరికాదన్నారు. హక్కుల సాధనకు మేడే స్ఫూర్తితో కార్మికులందరు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మేడేను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, కుమార్, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

సచివాలయం చుట్టూ నో ఎంట్రీ

సాక్షి, సిటీబ్యూరో: హుస్సేన్‌సాగర్ తీరాన నిర్మితమైన కొత్త సచివాలయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆ చుట్టుపక్కల మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ అదనపు సీపీ జి.సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆహూతుల వాహనాలు మినహా మిగిలిన వాటిని అనుమతించరు. ఖైరతాబాద్ జంక్షన్, నెక్లెస్ రోటరీ–ఎన్టీఆర్ మార్గ్‌లో వాహనాలకు అనుమతి ఉండదు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలను నిరంకారి మీదుగా, ఇక్బాల్ మీనార్ నుంచి ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వాహనాలను తెలుగు తల్లి ఫ్లైఓవర్, కట్టమైసమ్మ, లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా పంపిస్తారు. ట్యాంక్‌బండ్ వైపు నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మీనార్ వైపు, బడా గణేశ్ లైన్ నుంచి మింట్ వైపు వచ్చే వాహనాలను రాజ్‌దూత్ లైన్‌లోకి మళ్లిస్తారు. అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులకూ ఈ మళ్లింపులు వర్తిస్తాయి. నిర్దేశిత వేళల్లో ఖైరతాబాద్, ఓల్డ్ సైఫాబాద్, రవీంద్రభారతి, మింట్ కాంపౌండ్, తెలుగు తల్లి, నెక్లెస్ రోటరీ, నల్లగుట్ట, కట్టమైసమ్మ, ట్యాంక్‌బండ్, లిబర్టీ జంక్షన్ల మీదుగా ప్రయాణించవద్దని పోలీసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ఆహూతుల కోసం 2,151 కారు పాస్‌లు జారీ చేశారు. వీరికి వేర్వేరు ప్రాంతాల్లో అలాటింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ఇవి కాకుండా మరో 70 వాహనాలకు ఎన్టీఆర్ ఘాట్, 100 కార్లకు బీఆర్‌కేఆర్ భవన్, 1000 కార్లకు పీవీ నరసింహారావు మార్గ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా నగర ట్రాఫిక్ పోలీసు అధికారిక సోషల్ మీడియా పేజీలతో పాటు 90102 03626ను సంప్రదించాలని ట్రాఫిక్ చీఫ్ సుధీర్‌బాబు సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చాధర్‌ఘాట్‌కు చెందిన సయ్యద్ మునావర్ హుస్సేన్ మూస్వీ(50) ఈ నెల 22న ఉదయం తుమ్మలూర్ నుంచి నగరానికి వెళ్తున్నాడు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. అప్పటి నుంచి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఎరుకలి పుల్లయ్య మృతదేహం

కొందుర్గు: విద్యుదాఘాతంలో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మహదేవ్‌పూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహదేవ్‌పూర్ గ్రామానికి చెందిన రైతు ఎరుకలి పుల్లయ్య(65) శుక్రవారం రాత్రి పొలానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. పొలంలవద్ద స్టార్టర్‌లో విద్యుత్ వైర్లను సరి చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైన అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పొలంలో విగతజీవిగా పడి ఉన్నాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్యాంరావు తెలిపారు.

కేసీఆర్‌తోనే కుల సంఘాలకు ప్రాధాన్యత

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యేను కలిసిన ఉప్పర సంఘం నాయకులు

యాచారం: సీఎం కేసీఆర్‌తోనే కుల సంఘాలకు ప్రాధాన్యత పెరిగిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతపట్లకు చెందిన ఉప్పర సంఘం నాయకులు శనివారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో కుల సంఘాల కమ్యూనిటీ భవనాలకు రూ.5 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గొల్ల, కుర్మలకు గొర్లు, మేకలు, దళితులకు దళితబంధు పథకం, ఇతర కులాలకు విరివిగా రుణాలు ఇప్పించి వారి ఆర్థిక ప్రగతి కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కేసీఆర్‌కు అండగా ఉండాలని కోరారు. అలాగే, చింతపట్ల ఉప్పెర సంఘం కమ్యూనిటీ భవనానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, చింతపట్ల మాజీ ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, నాయకులు పెండ్యాల చంద్రయ్య, సింగారం వెంకటయ్య, మధుకర్‌రెడ్డి, జగన్, రవి, మహేందర్, భిక్షపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేలకూలిన స్తంభాలు

గ్రేటర్ జిల్లాల్లో 218 ఫీడర్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: ఈదురు గాలితో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా వ్యవస్థ అతలాకుతలమైంది. శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి గ్రేటర్ జిల్లాల్లో 218 ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ బర్కత్‌పురా నాలాకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం నేలకూలింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ నాలాలో పడిపోయింది. రాజేంద్రనగర్, సికింద్రాబాద్, హబ్సిగూడ సర్కిళ్లలో లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో వైర్లు తెగిపడ్డాయి. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ట్రిప్పవడంతో ఆయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని ప్రాంతాల్లో గంట నుంచి రెండు గంటల్లోనే సరఫరాను పునరుద్ధరించగా ముషీరాబాద్, సికింద్రాబాద్, తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా కరెంట్ సరఫరా కాలేదు. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో అంధకారం నెలకొంది. ఉక్కపోతకు తోడు ఇంట్లో కరెంట్ కూడా లేకపోవడంతో దోమలు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా స్తంభాలపై వ్యక్తిగత నివాసాల సర్వీసు వైర్లు కాలిపోవడంతో రోజంతా కరెంట్ లేకపోవడంతో ఆయా వినియోగదారులంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో మెరిసిన కొందుర్గు విద్యార్థి

కొందుర్గు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో కొందర్గు మండల పరిధిలోని అయోధ్యపూర్ తండాకు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. ఆల్ ఇండియా స్థాయిలో 5590 ర్యాంకును సాధించింది. నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన ప్రవళిక గిరిజన కుటుంబంలో పుట్టిన ప్రవళిక చదువులో రాణిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నది. ప్రవళికకు ఆల్ ఇండియా ర్యాంకు రావడంతో పలువురు నాయకులు, తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక వాటిని మరచిపోయారని విమర్శించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సమ్మె చేస్తున్న పంచాయితీ జూనియర్ కార్యదర్శులకు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలుతో కలసి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించిన సీఎం ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. నియంతృత్వ పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కృష్ణనాయక్, రాజు, మహేశ్, కరీం, రాఘవేందర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఈత కోసం వెళ్లి..

నీటి కుంటలో మునిగి విద్యార్థి దుర్మరణం



ప్రవీణ్ (ఫైల్)

మహేశ్వరం: ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మస్కల్ గ్రామానికి చెందిన జిర్గే గుర్రప్ప శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో అద్దెకు ఉంటూ కూలీ పనులు చేసూకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గుర్రప్ప కుమారుడు జిర్గే ప్రవీణ్‌కుమార్(15) చిన్న గోల్కొండ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో శనివారం మధ్యాహ్నం స్నేహితులతో గ్రామ శివారులో ఉన్న వరిచేరు కుంటలో ఈత కొట్టేందుకు దిగారు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.